సాక్షి
వికారాబాద్
ఆదివారం । 7 । సెప్టెంబర్ । 2025



మా ఊరి కోడళ్లు..

దుద్యాల మండలం వాల్యానాయక్ తండాలో అనాదిగా కొనసాగుతున్న ఆచారం ఆశ్చర్యానికి గురిచేస్తోంది. 8లో▸

న్యూస్‌రీల్

నేడు పాంబండ ఆలయం మూసివేత

కుల్కచర్ల: చంద్ర గ్రహణం నేపథ్యంలో గిరిప్రదక్షిణ, ప్రత్యేక పూజల అనంతరం ఆదివారం ఉదయం 9:56 గంటలకు పాంబండ రామలింగేశ్వర స్వామి ఆలయాన్ని మూసివేయడం జరుగుతుందని ఆలయ చైర్మన్ కోట్ల మైపాల్ రెడ్డి, ఈఓ బాలనర్సయ్య శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 6గంటలకు రుద్ర హోమం, 7గంటలకు గిరిప్రదక్షిణ నిర్వహించడం జరుగుతుందన్నారు. అనంతరం భక్తులకు దర్శనం కల్పించి ఆలయాన్ని మూసివేసి మరుసటి రోజు సోమవారం ఉదయం 7గంటలకు ఆలయ సంప్రోక్షణ అనంతరం భక్తులకు దర్శనం కల్పించడం జరుగుతుందని పేర్కొన్నారు. ఇందుకు భక్తులు సహకరించాలని ఆయన కోరారు.

రేపు టీఎల్‌ఎం మేళా

మోమిన్‌పేట: మండలంలోని మేకవనంపల్లి ఉన్నత పాఠశాలలో ఈనెల 8న మండల స్థాయి టీఎల్‌ఎం మేళా నిర్వహించనున్నట్లు ఎంఈఓ మల్లేశం శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. మండలంలోని ఆయా ప్రాథమిక,ప్రాథమికోన్నత పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు మేళాకు హాజరుకావాలని సూచించారు. ఉదయం 10గంటలకు కార్యక్రమం ప్రారంభమవుతుందని తెలిపారు.

ఉచిత వైద్య శిబిరానికి స్పందన



రక్త పరీక్షలు చేస్తున్న వైద్య సిబ్బంది

తాండూరు టౌన్: సేవా భారతి, మధుకర సేవా సమితి, కిమ్స్ ఆస్పత్రుల ఆధ్వర్యంలో శనివారం స్థానిక ఆర్యవైశ్య ఓపెన్ ఆడిటోరియంలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. తాండూరు పట్టణ పరిధిలోని మల్‌రెడ్డిపల్లి, ఇందిరానగర్ కాలనీలకు చెందిన 300 మందికి రక్త పరీక్షలు చేశారు. వ్యాధి నిర్ధారణ అయిన వారిని ఆపరేషన్‌కు సిఫారసు చేశారు. కార్యక్రమంలో సేవా భారతి ప్రతినిధులు శివశంకర్, వెంకటేష్, రమేష్, శ్రీనివాస్, మధుకర సేవా సమితి వ్యవస్థాపకులు డాక్టర్ విమలాకర్ రెడ్డి, కిమ్స్ ఆస్పత్రి వైద్యులు పాల్గొన్నారు.

గ్రామ పంచాయతీ భవన నిర్మాణానికి భూమిపూజ



భవన నిర్మాణానికి భూమిపూజ చేస్తున్న ప్రశాంతు

కొడంగల్ రూరల్: మండలంలోని ఉడిమేశ్వరం గ్రామంలో శనివారం గ్రామ పంచాయతీ భవన నిర్మాణానికి కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు నందారం ప్రశాంతు ఆధ్వర్యంలో భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా సీఎం రేవంత్ రెడ్డి, కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ తిరుపతిరెడ్డి, పీసీసీ మెంబర్ మహ్మద్ యూసుఫ్‌కు ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో మాజీ సర్పంచులు హన్మిరెడ్డి, మొగులయ్య, శ్రీనివాస్‌రెడ్డి, పార్టీ గ్రామ అధ్యక్షుడు శ్రీనివాస్, నాయకులు శ్రీనివాస్, లక్ష్మప్ప, జనార్దన్, సాయిలు, మాసప్ప, మహేష్, సయ్యద్ పాషా, అంజిలప్ప, ఏఈ రవికిరణ్‌రెడ్డి, పంచాయతీ కార్యదర్శి రమేష్ పాల్గొన్నారు.

ఇల్లు కట్టండి.. బిల్లు పొందండి

హౌసింగ్ ఏఈ రహీం



ఇందిరమ్మ ఇంటి పనులను పరిశీలిస్తున్న హౌసింగ్ ఏఈ రహీం

తాండూరు రూరల్: ఇందిరమ్మ ఇల్లు మంజూరైన లబ్ధిదారులు సకాలంలో పనులు పూర్తి చేస్తే వెంటనే బిల్లులు చెల్లిస్తామని పెద్దేముల్ హౌసింగ్ ఏఈ రహీం అన్నారు. శనివారం పెద్దేముల్ మండలం కందనెల్లి తండాలో నిర్మాణ దశలో ఉన్న ఇంటిని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మండలంలో 798 మందికి ఇందిరమ్మ ఇళ్లు మంజూరైనట్లు తెలిపారు. ఇప్పటి వరకు సగం ఇళ్ల పనులు ప్రారంభమైనట్లు చెప్పారు. 150 మందికి పునాది పనుల బిల్లులు చెల్లించినట్లు తెలిపారు. నాలుగు దశల్లో బిల్లులు వస్తాయని పేర్కొన్నారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి నవిత తదితరులు పాల్గొన్నారు.

బైబై గణేశా



అనంతగిరి: ఎబ్బనూరు చెరువులో వినాయకుడి నిమజ్జనం



అనంతగిరి: హారతి తీసుకుంటున్న స్పీకర్ ప్రసాద్‌కుమార్



కొడంగల్‌లో నిమజ్జనానికి బయలు దేరిన విగ్రహం



కొడంగల్‌లో ముస్తాబైన గణేశుడు

అనంతగిరి/కొడంగల్/పరిగి: వినాయక చవితి ఉత్సవాల్లో భాగంగా పదకొండు రోజులు పూజలందుకున్న గణేశుడు శనివారం రాత్రి గంగమ్మ చెంతకు చేరాడు. వికారాబాద్ పట్టణం, మండలంలో ఏర్పాటు చేసిన విగ్రహాలను ధారూరు మండలం ఎబ్బనూరు చెరువులో నిమజ్జనం చేశారు. వందలాది ప్రతిమలు తరలిరాగా జనంతో చెరువు ప్రాంతం కిక్కిరిసిపోయింది. పిల్లలు, పెద్దలు, మహిళలు, యువతీయువకులు ఉత్సాహంగా పాల్గొన్నారు. జై గణేశ.. జైజై గణేశ అంటూ ముందుకు సాగారు. వీధులన్నీ సందడిగా మారాయి. ఎస్పీ నారాయణరెడ్డి, అడిషనల్ కలెక్టర్ లింగ్యానాయక్, ఆర్డీఓ వాసుచంద్ర, పోలీసు అధికారులు ఏర్పాట్లను దగ్గరుండి పర్యవేక్షించారు. కొడంగల్ పట్టణంలో ప్రతిష్ఠించిన విగ్రహాలను స్థానిక పెద్ద చెరువులో నిమజ్జనం చేశారు. దాదాపు 25 భారీ విగ్రహాలు, వందకు పైగా చిన్న ప్రతిమలను గంగమ్మ చెంతకు చేర్చారు. సీఐ శ్రీధర్‌రెడ్డి, మున్సిపల్ కమిషనర్ బలరామ్ నాయక్ ఆధ్వర్యంలో ఈ ప్రక్రియ ప్రశాంతంగా సాగింది. పరిగి పట్టణంలో కొలువుదీరిన వినాయకుడి విగ్రహాలను లక్నాపూర్ ప్రాజెక్టులో నిమజ్జనం చేశారు. తహసీల్దార్ వెంకటేశ్వరీ, మున్సిపల్ కమిషనర్ వెంకటయ్య, పోలీస్ అధికారులు పర్యవేక్షించారు. పరిగి, పూడూరు, ధారూరు మండలాల నుంచి పెద్ద సంఖ్యలో విగ్రహాలు వచ్చాయి. నిమజ్జనం ప్రశాంతంగా ముగియడంతో అధికారులు ఊపిరి పీల్చుకున్నారు. సహకరించిన ప్రజలకు, మండప నిర్వాహకులకు, ఉత్సవ సమితి నాయకులకు ధన్యవాదాలు తెలిపారు.



అనంతగిరి: వికారాబాద్‌లో శోభాయాత్ర



అనంతగిరి: వికారాబాద్‌లో..



కోయ వేషధారణలో యువకులు



శోభాయాత్రలో భక్తుల సందడి



దోమ: బాస్‌పల్లి నిమజ్జన వేడుకల్లో ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి తదితరులు



అనంతగిరి: అన్నదాన కార్యక్రమం



రూ.5.51 లక్షలకు లడ్డూ ప్రసాదం దక్కించుకున్న ప్రవీణ్‌గౌడ్



బషీరాబాద్: పూజలో పాల్గొన్న ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి తదితరులు

గణేశ్ లడ్డూ రూ.1.31 లక్షలు



దుద్యాల్: లడ్డూతో యువకులు



ధారూరు: లడ్డూ ప్రసాదంతో ప్రభాకర్‌రెడ్డి

ధారూరు: మండలంలోని కేరెల్లి గ్రామ హనుమాన్ మందిరంలో ఏర్పాటు చేసిన గణేశ్ లడ్డూ ప్రసాదాన్ని శనివారం వేలం నిర్వహించారు. గ్రామానికి చెందిన ప్రభాకర్‌రెడ్డి, మల్లారెడ్డి పోటీ పడ్డారు. రూ.1.31 లక్షలకు ప్రభాకర్‌రెడ్డి సొంతం చేసుకున్నారు. కార్యక్రమంలో ఉత్సవ కమిటీ నాయకులు నాగిరెడ్డి, దయాకర్‌రెడ్డి, చెన్నారెడ్డి పాల్గొన్నారు.

హస్నాబాద్‌లో రూ.1,04,000

దుద్యాల్: మండలంలోని హస్నాబాద్‌లో వినాయకుడి లడ్డూని గ్రామానికి చెందిన గోపాల్ హన్మంతు రూ.1,04,000 దక్కించుకున్నారు. చేపల సంఘం వద్ద ఏర్పాటు చేసిన లడ్డూని రూ.71 వేలకు బైండ్ల శివకుమార్ సొంతం చేసుకున్నారు.

సమస్యలపై అలుపెరుగని పోరాటం




సభ్యత్వం తీసుకున్న విద్యార్థినులతో శ్రీనివాస్

పీడీఎస్‌యూ జిల్లా అధ్యక్షుడు శ్రీనివాస్

తాండూరు టౌన్: విద్యా రంగంలో నెలకొన్న సమస్యల పరిష్కారం కోసం పీడీఎస్‌యూ ఆధ్వర్యంలో అలుపెరుగని పోరాటం చేస్తామని ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు పి.శ్రీనివాస్ అన్నారు. శనివారం స్థానిక శాలివాహన డిగ్రీ కళాశాల, అంబేడ్కర్ పారా మెడికల్ కళాశాలల్లో విద్యార్థి సంఘ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పీడీఎస్‌యూ ఆధ్వర్యంలో విద్యార్థుల సమస్యలపై అనేక పోరాటాలు చేస్తున్నామన్నారు. ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్ షిప్స్, హాస్టళ్లలో వసతుల కల్పన, విద్యార్థి సంక్షేమం, హక్కుల సాధన కోసం అనేక ఉద్యమాలు చేశామన్నారు. కేంద్ర ప్రభుత్వం తీసుకురానున్న నూతన జాతీయ విద్యావిధానానికి వ్యతిరేకంగా రాష్ట్ర ప్రభుత్వం అసెంబ్లీలో తీర్మానం చేయాలని డిమాండ్ చేశారు.

మహిళలు ఆర్థికంగా ఎదగాలి

స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్



మాట్లాడుతున్న స్పీకర్ ప్రసాద్‌కుమార్

అనంతగిరి: మహిళలు నచ్చిన రంగాల్లో నైపుణ్యాన్ని పెంచుకొని ఆర్థికంగా ఎదగాలని స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్ అన్నారు. శనివారం వికారాబాద్ పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఎస్సీ కార్పొరేషన్ సహకారంతో స్ఫూర్తి గ్రామీణ అభివృద్ధి సంస్థ వారి సౌజన్యంతో ఉచిత శిక్షణ పూర్తి చేసుకున్న ఎస్సీ మహిళకు ఉచితంగా కుట్టుమిషన్లు పంపిణీ చేశారు. సర్టిఫికెట్లు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం మహిళల సంక్షేమం కోసం అనేక పథకాలు అమలు చేస్తోందన్నారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ ఎం సుధీర్, ఎస్సీ కార్పొరేషన్ ఈడీ బాబుమోజెస్, ఆర్టీఏ సభ్యులు జాఫర్ తోపాటు కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు సుధాకర్ రెడ్డి, జెడ్పీటీసీ మాజీ సభ్యుడు మైపాల్ రెడ్డి, మున్సిపల్ మాజీ చైర్మన్ సత్యనారాయణ, స్ఫూర్తి గ్రామీణ అభివృద్ధి సంస్థ ప్రధాన కార్యదర్శి వేణుగోపాల్ రెడ్డి, ప్రసన్న పాల్గొన్నారు.

పథకాల కోసం లంచం ఇవ్వొద్దు

- అవగాహనతోనే బాల్య వివాహాలకు అడ్డుకట్ట
- తాండూరు ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి



లబ్ధిదారులకు చెక్కులు అందజేస్తున్న ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి

తాండూరు: ప్రభుత్వ సంక్షేమ పథకాల కోసం ఎవ్వరికీ లంచం ఇవ్వరాదని తాండూరు ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి అన్నారు. శనివారం పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో 96 మంది లబ్ధిదారులకు రూ.96,11,136 విలువ చేసే కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్ చెక్కులు అందజేశారు. మరో 119 మందికి రూ.39.79 లక్షల విలువ చేసే సీఎంఆర్‌ఎఫ్ చెక్కుల పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సంక్షేమ పథకాలను పారదర్శకంగా ప్రజలకు అందిస్తున్నామన్నారు. పథకాల కోసం కొందరు లంచం తీసుకున్నట్లు తెలిసిందన్నారు. నియోజకవర్గంలో రోడ్ల అభివృద్ధికి రూ.400 కోట్లు మంజూరైనట్లు చెప్పారు. గత ప్రభుత్వం తాండూరు పట్టణంలో వెయ్యి డబుల్ బెడ్‌రూం ఇళ్లను అసంపూర్తిగా వదిలేసిందన్నారు. వాటిని పూర్తి చేసి పేదలకు పంపిణీ చేస్తామని తెలిపారు. తాండూరు నియోజకవర్గానికి 3,500 ఇందిరమ్మ ఇళ్లు మంజూరయ్యాయని ప్రస్తుతం పనులు చురుగ్గా సాగుతున్నట్లు వివరించారు. కార్యక్రమంలో మున్సిపల్ మాజీ చైర్మన్ స్వప్న పరిమళ్, డీసీసీబీ వైస్ చైర్మన్ రవిగౌడ్, మార్కెట్ కమిటీ చైర్మన్ పట్లోల్ల బాల్‌రెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ సురేందర్‌రెడ్డి, కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షులు హబీబ్‌లాల, మాజీ కౌన్సిలర్లు ప్రభాకర్‌గౌడ్, వెంకన్నగౌడ్, నాయకులు అబ్దుల్ రవూఫ్ తదితరులున్నారు.

ఆర్టీసీకి అండగా ఉంటాం

తాండూరు టౌన్: ఆర్టీసీకి కాంగ్రెస్ ప్రభుత్వం అన్ని విధాలా అండగా ఉంటుందని స్థానిక ఎమ్మెల్యే బుయ్యని మనోహర్ రెడ్డి అన్నారు. శనివారం తాండూరు నుంచి గానుగాపూర్ వరకు కొత్త బస్సు సరీస్సును జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన హామీ ప్రకారం మహాలక్ష్మి పథకం ద్వారా మహిళలకు ఉచిత ఆర్టీసీ బస్సు సౌకర్యం కల్పించిందన్నారు. ఈ పథకం ద్వారా ఇప్పటి వరకు రాష్ట్ర వ్యాప్తంగా నాలుగున్నర కోట్ల మంది ప్రయాణం చేశారని పేర్కొన్నారు. తాండూరు డిపోకు కొత్తగా 43 బస్సులను తీసుకురావడంతో పల్లె పల్లెకూ బస్సు వెళ్తోందన్నారు. గానుగాపూర్‌కు కొత్త బస్సు సౌకర్యం కల్పించడం వల్ల తాండూరు ప్రాంత ప్రజలు దత్తాత్రేయ స్వామి దర్శనానికి వెళ్లేందుకు సులభతరమైందన్నారు. ఆర్టీసీ బస్సు డ్రైవర్లు, కండక్టర్లు ప్రయాణికుల పట్ల గౌరవంగా నడుచుకుంటూ సంస్థను లాభాల బాటలో పయనించేలా కృషి చేయాలన్నారు. ఎమ్మెల్యే, తదితరులు టికెట్ కొనుగోలు చేసి కొంత దూరం బస్సులో ప్రయాణించారు. కార్యక్రమంలో డిపో మేనేజర్ సురేష్ కుమార్, సిబ్బంది, మార్కెట్ కమిటీ చైర్మన్ పట్లోళ్ల బాల్‌రెడ్డి, డీసీసీబీ వైస్ చైర్మన్ రవిగౌడ్, కాంగ్రెస్ నాయకులు సర్దార్ ఖాన్, డాక్టర్ సంపత్, మురళీకృష్ణ గౌడ్, హబీబ్‌లాలా, ప్రభాకర్ గౌడ్, లింగదల్లి రవి, గాజుల మాధవి, వెంకటయ్య, బంటు వేణు, బంటు మల్లప్ప, రాందాసు, గోపాల్, మల్లేశం తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

ఆంజనేయస్వామికి ప్రత్యేక పూజలు



సామూహిక హనుమాన్ చాలీసా పారాయణం చేస్తున్న భక్తులు

కొడంగల్ రూరల్: పట్టణ శివారులోని సిద్దనొంపు పడమటి ఆంజనేయస్వామికి శనివారం హిందూవాహిని ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం 102వ శనివారాన్ని పురస్కరించుకొని సామూహిక హనుమాన్ చాలీసా పారాయణం చేశారు.

డ్రాఫ్ట్ ఓటరు జాబితా ప్రదర్శన



వికారాబాద్ జెడ్పీ కార్యాలయంలో ఓటరు జాబితాను ప్రదర్శిస్తున్న అడిషనల్ కలెక్టర్

అనంతగిరి: జెడ్పీటీసీ ఎన్నికలకు సంబంధించిన ఓటరు జాబితా, పోలింగ్ కేంద్రాల జాబితాను శనివారం వికారాబాద్ జెడ్పీ కార్యాలయంలో ప్రదర్శించారు. కార్యక్రమంలో అడిషనల్ కలెక్టర్ సుధీర్ తదితరులు పాల్గొన్నారు. అదేవిధంగా మండల స్థాయిలో ఎంపీడీఓలు వారివారి మండలాల్లో ఓటరు, పోలింగ్ కేంద్రాల జాబితాను ప్రదర్శించారు.

సరళారెడ్డికి బిజినెస్ ఎక్స్‌లెన్స్ అవార్డు



కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి చేతుల మీదుగా అవార్డు అందుకుంటున్న సరళారెడ్డి

యాలాల: మండలంలోని జక్కేపల్లి సమీపంలో గల ఆర్‌బీఓఎల్(రాడికల్ బయో ఆర్గానిక్స్ లిమిటెడ్) ఎండీ బుయ్యని సరళారెడ్డి బిజినెస్ ఎక్స్‌లెన్స్ అవార్డు అందుకున్నారు. శుక్రవారం హైదరాబాద్‌లో జరిగిన బిజినెస్ అవార్డ్స్ – 2025 కార్యక్రమంలో భాగంగా కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి, అసెంబ్లీ డిప్యూటీ స్పీకర్ జాటోత్ రాంచందర్ నాయక్ చేతుల మీదుగా అవార్డు అందుకున్నారు. తెలుగు రాష్ట్రాల వ్యాపార రంగంలో విశిష్ట కృషి, నూతన ఆవిష్కరణలు, సమాజానికి అందిస్తున్న సేవలను గుర్తించి ఈ అవార్డును అందిస్తుంటారు. సరళారెడ్డికి అవార్డు రావడంపై తాండూరు ప్రాంత నాయకులు, శ్రేయోభిలాషులు అభినందనలు తెలిపారు.

అంబేడ్కర్ భవన నిర్మాణ పనులు ప్రారంభించండి

కేవీపీఎస్ ప్రధాన కార్యదర్శి మల్కయ్య



శిలాఫలకం వద్ద నాయకులు

యాలాల: మండల కేంద్రంలో అంబేడ్కర్ భవన నిర్మాణ పనులను వెంటనే ప్రారంభించాలని కేవీపీఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి మల్కయ్య, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు బుగ్గప్ప డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. గత ప్రభుత్వం 2022లో రూ.50లక్షల నిధులు కేటాయించి భవన నిర్మాణానికి శిలాఫలకం వేసిందన్నారు. భవన నిర్మాణానికి ఎకరా ప్రభుత్వ భూమిని సైతం కేటాయించిన విషయాన్ని గుర్తు చేశారు. కాగా నిధులు ఉన్నప్పటికీ భవన నిర్మాణ పనులు ప్రారంభించకపోవడంపై అసంతృప్తి వ్యక్తం చేశారు. ఈ విషయంలో ఎమ్మెల్యే దృష్టి సారించి భవన నిర్మాణ పనులు ప్రారంభించేలా చూడాలని వారు కోరారు. ఈ కార్యక్రమంలో బెన్నూరు మాజీ ఎంపీపీ లక్ష్మప్ప, నర్సింలు, శ్రీనివాస్, రమేశ్ ఉన్నారు.

మా ఊరి కోడళ్లు.. మాంసం ముట్టరు!

'ఆన'వాయితీగా వస్తున్న ఆచారం

సండే స్పెషల్

వికారాబాద్ జిల్లా దుద్యాల మండలం వాల్యానాయక్‌తండాలో అనాదిగా కొనసాగుతున్న ఆచారం అందరినీ ఆశ్చర్యానికి గురిచేస్తోంది. ఈ గ్రామానికి కోడలిగా వచ్చే వారిని సాక్షాత్తూ గిరిజన దేవత సీతమ్మగా భావిస్తారు. కొత్త కోడలిగా తండాలోకి అడుగుపెట్టిన క్షణం నుంచి ఆమె మాంసం, కల్లు, మద్యం వంటి మత్తు పదార్థాలకు దూరంగా ఉంటుంది. ఇలా తాతల కాలం నుంచి ఈరోజు వరకు తండాకు వచ్చిన సుమారు 200 మందికిపైగా ఈ సంప్రదాయాన్ని సంతోషంగా పాటిస్తుండటం గమనార్హం.

- కల్లు, మద్యం, మత్తుపదార్థాల జోలికెళ్లరు
- వాల్యానాయక్‌తండాలో అనాదిగా వస్తున్న ఆచారం
- పెళ్లి జరిపించే రోజునే ప్రతిజ్ఞ చేయిస్తున్న పెద్దలు
- ఆ క్షణం నుంచే ఆమెకు సీతమ్మతల్లిగా గౌరవం



వాల్యానాయక్‌తండా

దుద్యాల్: గిరిజనులు, లంబాడాలు ఇష్టంగా తినేది మాంసాహారమే. అటవీ ప్రాంతంలో ఉండే వీరికి జంతువులు, పక్షులు, చేపలను వేటాడటం, కోళ్లు, మేకలు, గొర్రెలను పెంచడం వంటివి చిన్నతనం నుంచే అబ్బుతాయి. ఈక్రమంలో మహిళలు, పురుషులు, చిన్నాపెద్దా అనే తేడా లేకుండా వారంలో కనీసం మూడుసార్లయినా మాంసం తింటారు. నీసు(మాసం) లేనిదే ముద్దదిగదని చాలా మంది బహిరంగంగానే చెబుతుంటారు. ఇలాంటి వాతావరణంలో పుట్టి పెరిగిన వారికి ఒక్కసారిగా మాంసానికి దూరంగా ఉండమంటే కష్టమే. కానీ వాల్యానాయక్‌తండాకు కోడలిగా వచ్చేవారు ఎవరైనా మాంసం, మద్యానికి దూరంగా ఉండాల్సిందే. సుమారు రెండు శతాబ్దాలకు పైగా ఈ ఆచారం కొనసాగుతోంది. వివాహం చేసుకునే వరుడు తాళికట్టి, కుంకుమబొట్టు పెడితే చాలు కట్టుబాటును పాటించాల్సిందే. అయితే ఇప్పటి వరకూ మహిళలెవరూ దీన్ని కట్టుబాటుగా భావించకపోవడం విశేషం. ఇది ఎక్కడికెళ్లినా తమకు అత్యంత గౌరవాన్ని తెచ్చిపెడుతుందని తండా కోడళ్లు చెబుతున్నారు. ఇతర గ్రామాలు, బంధువుల శుభకార్యాలకు వెళితే తమకు ప్రత్యేక భోజనం వండి పెడుతారని పేర్కొంటున్నారు.

పెళ్లి రోజే ప్రతిజ్ఞ

వాల్యానాయక్‌తండాలో 700 మంది జనాభా ఉంటుంది. ఇంటికి వచ్చే కోడలే తమ వంశాన్ని వృద్ధి చేస్తుందని, ఇంటిల్లిపాదిని తల్లిలా లాలిస్తూ కుటుంబ అభివృద్ధి, అభ్యున్నతికి పాటుపడుతుందని తండావాసుల విశ్వాసం. ఇంటి తీరు వాకిలి చెబుతుందనే విధంగా ఇంట్లోని కోడలు తాత్విక, సత్వ గుణాలను కలిగి ఉంటే.. భర్త, అత్తామామలను బాగా చూసుకుంటుందని, పిల్లలు సైతం ఆమెను అనుకరిస్తారనేది వీరి నమ్మకం. అందుకే వివాహ నిశ్చయానికి ముందే గ్రామ పెద్దలు, కుటుంబ సభ్యులు కొత్త కోడలికి అన్ని విషయాలు చెబుతారు. ఇందుకు ఆమె మనస్ఫూర్తిగా అంగీకరించిన తర్వాతే పెళ్లి పక్కా చేస్తారు. పెళ్లి కూతురును ముస్తాబు చేసిన తర్వాత.. మాంసం, మత్తు పదార్థాలకు దూరంగా ఉంటానని ఆమెతో ప్రతిజ్ఞ చేయిస్తారు.

ఆచారం వచ్చిందిలా..

సుమారు నూటాయాభై ఏళ్ల క్రితం వాల్యానాయక్ తండాలో అంటు వ్యాధులు(గత్తర) సోకి చాలా మంది ప్రాణాలు కోల్పోయారు. ఈసమయంలో తమను కాపాడమంటూ గిరిజనులు తమ ఆరాధ్య దైవమైన సీతమ్మను పూజించారు. తాము గత్తర నుంచి బయటపడితే తండాలోని కోడళ్లను మాసం, కల్లు వంటివి మాన్పిస్తామని మొక్కుకున్నారు. ఆనాటి నుంచి తండాలో రోగాలు తగ్గి, పంటలు పండాయని, ఆహారం సమృద్ధిగా దొరికిందని వృద్ధులు చెబుతున్నారు.

కరోనా కాలంలోనూ..

ఇటీవల ప్రపంచాన్ని వణికించిన కరోనా కాలంలోనూ తండా కోడళ్లు మటన్, చికెన్, గుడ్డు వంటివి ముట్టుకోలేదు. వైరస్ బారిన పడిన వారికి పోషకాహారం తీసుకోవాలని ఇందులో భాగంగా గుడ్లు, మాంసం తినాలని వైద్యులు సూచించినా ఎవరూ వాటి జోలికి వెళ్లలేదు. తమను అమ్మవారే కాపాడిందని, కాపాడుతుందని చెప్పడం విశేషం. ప్రాణాలు పోయినా పరవాలేదు కానీ ఆచారాన్ని మంటగలిపే పని చేయలేదన్న వీరికి నిజంగా హ్యాట్సాఫ్ చెప్పాల్సిందే.



సీతమ్మ పండుగలో మహిళలు(ఫైల్)

అందరికీ ఆదర్శంగా..

తాతలు, తండ్రుల కాలంలో మదుమాంసాలకు దూరంగా ఉన్న అనేక కుటుంబాల్లోని వారు ప్రస్తుతం వీటిని అలవాటు చేసుకున్నారు. పార్టీలు, దావత్‌ల పేరుతో మద్యం, మాంసానికి ఎక్కువ ప్రాధాన్యం ఇస్తున్నారు. మేమెందుకు తినకూడదు అని.. ఎదురు ప్రశ్నిస్తున్న సందర్భాలూ లేకపోలేదు. ఇలాంటి తరుణంలో గిరిజన కుటుంబాల్లోని కోడళ్లు వీటిని త్యజించడం అందరికీ ఆదర్శంగా నిలుస్తోంది.

45 ఏళ్లుగా మాంసానికి దూరం



మా తల్లిదండ్రుల గ్రామం రోటిబండ తండా. నా చిన్నతనంలో మాంసం ఇష్టంగా తినేదాన్ని. నాపెళ్లయి 45 ఏళ్లు దాటింది. ఆరోజు నుంచి ఇప్పటి వరకు మాంసం జోలికి వెళ్లలేదు. మా అత్త కూడా మాంసం తినలేదు.

– అన్లీబాయి

తరతరాలుగా వస్తున్న ఆచారం



తండా కోడళ్లు మాంసం తినకూడదనేది తరతరాలుగా వస్తున్న ఆచారం. మాకన్నా పెద్దవాళ్లు పాటించారు.. మేమూ కొనసాగిస్తున్నాం.. ఇప్పటి పిల్లలు కూడా మాతోవలోనే నడవడం సంతోషం కలిగిస్తోంది.

– ప్రమీళాబాయి

అదృష్టంగా భావిస్తున్నా..



నేను పీజీ చదివా.. స్టూడెంట్‌గా ఉన్న రోజుల్లో మాంసాహారం బాగా తినేదాన్ని. నాకు ఇటీవలే పెళ్లయింది. తండా ఆచారాన్ని చెప్పినప్పుడు వింతగా అనిపించినా.. ఇక్కడికి వచ్చాక ఇది ఎంతో అదృష్టమని తెలుసుకున్నా.

– పద్మ

వండుతాం.. కానీ తినం



నేను కూడా మొదట్లో ఇదేం ఆచారం అని విచారపడ్డా. కానీ మాంసం వదిలేసిన కోడళ్లకు ఇక్కడ లభిస్తున్న గౌరవం చూసి ఆ ఆలోచన మారిపోయింది. ఇంట్లో మగవాళ్లు, వచ్చే బంధువులకు వండుతా కానీ నేను తినను.

– శ్రీలత, అంగన్‌వాడీ టీచర్

సోదరిపై మాజీ సర్పంచ్ దాడి

పోలీస్ స్టేషన్‌లో పరస్పర ఫిర్యాదులు



గాయపడిన గంగ్లీబాయి

బషీరాబాద్: ఓ మాజీ సర్పంచ్ తన సోదరిపై దాడికి పాల్పడి, తీవ్రంగా గాయపర్చాడు. ఈ ఘటన బషీరాబాద్ మండలం నంద్యానాయక్‌తండాలో చోటుచేసుకుంది. బాధితురాలు తెలిపిన వివరాల ప్రకారం.. తండాకు చెందిన మాజీ సర్పంచ్ శంకర్‌నాయక్, గంగ్లీబాయి కొంత కాలంగా డబ్బుల విషయమై గొడవ పడుతున్నారు. పదిహేను క్రితం హైదరాబాద్‌లో తన సోదరుడు శంకర్, వదిన సీతాబాయి తనపై దాడి చేశారని, ఇదే విషయమై వారం రోజుల క్రితం తండాలో పంచాయితీ పెట్టి మరోసారి కొట్టారని పేర్కొంది. ఈ విషయమై పోలీసులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదని వాపోయింది. ఇదిలా ఉండగా తన ఇంట్లో నుంచి గంగ్లీబాయి డబ్బులు చోరీ చేసిందని శంకర్ సైతం పీఎస్‌లో ఫిర్యాదు చేశాడు. సొంత అన్నాచెల్లెళ్లు కావడంతో మాట్లాడుకునేందుకు సమయం ఇచ్చామని హెడ్ కానిస్టేబుల్ రాఘవులు తెలిపారు.

రోడ్డు పక్కన దిగబడిన లారీ!

కొడంగల్ రూరల్: చైన్నై నుంచి మహబూబ్‌నగర్ మీదుగా భారీ లోడ్‌తో తాండూరు వెళ్తున్న లారీ రోడ్డు పక్కన దిగబడిపోయింది. శనివారం సాయంత్రం పర్సాపూర్ గేటు సమీపంలో ఎదురుగా వస్తున్న వాహనానికి సైడ్ ఇచ్చే క్రమంలో డ్రైవర్ లారీని కిందకి దించాడు. రహదారి విస్తరణ పనుల్లో భాగంగా కంకర, మొరం వేసి రోడ్డుపై ఒరిగిపోయింది. శనివారం ఇటాచీ సాయంతో దీన్ని బయటకు లాగారు.



మట్టిలో ఒరిగిపోయిన లారీ

నివేదిక కోసం కసరత్తు

- లోకాయుక్త ఆదేశంతో మైన్స్, రెవెన్యూ శాఖల్లో కదలిక
- పూర్తి స్థాయి రిపోర్ట్ అందజేసేందుకు సంయుక్త సర్వే



తహసీల్ కార్యాలయంలో సమావేశమై చర్చిస్తున్న తహసీల్దార్, మైన్స్ ఏడీ తదితరులు

తాండూరు రూరల్: లోకాయుక్త ఆదేశాలతో కదిలిన రెవెన్యూ, మైన్స్ అధికారులు ఉరుకులు, పరుగులు పెడుతున్నారు. వివరాలు ఇలా ఉన్నాయి.. ఓగిపూర్‌లోని తన పట్టా భూమి సర్వేనంబర్ 65లో పక్క పొలం యజమాని నాపరాతి వ్యర్థాలు పారబోస్తున్నారని తాండూరుకు చెందిన కర్నూలు వెంకట్రాంరెడ్డి, అలాగే సర్వే నంబర్ 58లోని తన భూమిలో అక్రమంగా తవ్వకాలు చేస్తున్నారని ఫసియొద్దీన్ అనే వ్యక్తి పలుమార్లు స్థానిక, జిల్లా స్థాయి అధికారులకు ఫిర్యాదుచేశారు. ఫలితం లేకపోవడంతో హైదరాబాద్ వెళ్లి లోకాయుక్తలో తమగోడు వెళ్లబోసుకున్నారు. దీంతో ఈనెల 11వ తేదీలోపు పూర్తి నివేదిక అందజేయాలని మైన్స్, రెవెన్యూ అధికారులకు లోకాయుక్త నుంచి ఆదేశాలు అందాయి. దీంతో కదిలిన యంత్రాంగం వారం రోజులుగా సదరు భూముల్లో సంయుక్త సర్వే చేస్తోంది. శనివారం సాయంత్రం మైన్స్ ఏడీ సత్యానారాయణ, తహసీల్దార్ తారాసింగ్ ఈ విషయమై చర్చించారు. పూర్తి స్థాయి నివేదిక అందజేసేందుకు సోమవారం మరోసారి సర్వే నిర్వహించాలని నిర్ణయించారు. లోకాయుక్త ఆదేశంతో సర్వే నంబర్ 58లో కొనసాగుతున్న అక్రమ తవ్వకాలను మైన్స్ ఏడీ సత్యానారాయణ ఆపేయించారు.

ఉపాధ్యాయుల చేతుల్లోనే భవిష్యత్తు



మాట్లాడుతున్న రాజశేఖర్‌రెడ్డి

బీజేపీ జిల్లా అధ్యక్షుడు రాజశేఖర్‌రెడ్డి

కుల్కచర్ల: ఉపాధ్యాయుల చేతుల్లోనే విద్యార్థుల భవిష్యత్తు దాగి ఉందని బీజేపీ జిల్లా అధ్యక్షుడు రాజశేఖర్ రెడ్డి అన్నారు. శనివారం కుల్కచర్ల మండలం బండవెల్కిచర్లలోని రవీంద్రభారతి పాఠశాలలో టీచర్స్‌డేను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. విద్యార్థులను అత్యుత్తమ పౌరులుగా తీర్చిదిద్దాల్సిన బాధ్యత ఉపాధ్యాయులపై ఉందన్నారు. అత్యంత గౌరవప్రదమైన ఉపాధ్యాయ, విద్యారంగ వ్యవస్థను ప్రభుత్వాలు బలోపేతం చేయాల్సిన అవసరం ఉందన్నారు. విద్యార్థులకు పాఠ్యాంశాలతో పాటు క్రమశిక్షణ, విలువలు, సంప్రదాయాలు, దేశభక్తి, జాతీయ భావాలను నేర్పించాలని సూచించారు. కార్యక్రమంలో పీఎస్‌పీఎస్ సంఘ వ్యవస్థాపక అధ్యక్షుడు రాఘవేందర్ గౌడ్, బీజేపీ మండల అధ్యక్షుడు వెంకటయ్య ముదిరాజ్, పాఠశాల డైరక్టర్ వెంకట్రాములు, ప్రిన్సిపాల్ అబ్దుల్ పర్వన్, రాంచంద్రయ్య, వెంకటయ్య, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

నాణ్యమైన భోజనం అందించాలి

ట్రైనీ కలెక్టర్ హర్ష చౌదరి



అంగన్‌వాడీ కేంద్రం పరిసరాలను పరిశీలిస్తున్న హర్ష చౌదరి

పూడూరు: మండల కేంద్రంలోని అంగన్‌వాడీ కేంద్రాన్ని శనివారం ట్రైనీ కలెక్టర్ హర్ష చౌదరి ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. చిన్నారులకు ఎలాంటి ఇబ్బంది లేకుండా చూడాలన్నారు. అంగన్‌వాడీ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. పిల్లలకు నాణ్యమైన పౌష్టికాహారం అందించాలని ఆదేశించారు. కార్యక్రమంలో సీడీపీఓ ప్రశాంతి, సూపర్‌వైజర్ కళావతి తదితరులు పాల్గొన్నారు.

ముదిరాజ్‌ల అభ్యున్నతికి కృషి

పరిగి ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి



ముదిరాజ్ సంఘం నాయకులకు ప్రొసీడింగ్స్ అందజేస్తున్న ఎమ్మెల్యే టీఆర్ఆర్

పరిగి: ముదిరాజ్‌ల అభ్యున్నతికి నిరంతరం కృషి చేస్తానని ఎమ్మెల్యే టి.రామ్మోహన్‌రెడ్డి అన్నారు. ఎన్నికల సమయంలో ముదిరాజ్ భవన నిర్మాణానికి భూమి కేటాయిస్తానని హామీ ఇచ్చారు. ఈ మేరకు ప్రత్యేక చొరవ తీసుకుని మండలంలోని రంగాపూర్ సమీపంలో ఎకర భూమిని ముదిరాజ్ భవన నిర్మాణానికి కేటాయిస్తూ కలెక్టర్ నుంచి ప్రొసీడింగ్ మంజూరు చేయించారు. దీంతో శనివారం ఆయన్ను నియోజకవర్గంలోని ముదిరాజ్‌లు ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ముదిరాజ్‌లకు ఏ కష్టం వచ్చినా తాను అండగా ఉంటానన్నారు. ముదిరాజ్ భవన నిర్మాణానికి సైతం నిధులు కేటాయింపునకు ప్రత్యేక చొరవ తీసుకుంటానని హామీ ఇచ్చారు.

కొందుర్గులో క్షుద్ర పూజల కలకలం

కొందుర్గు: మండల కేంద్రంలో క్షుద్ర పూజలు కలకలం రేపాయి. పెండ్యాల శ్రీలక్ష్మి నరసింహ స్వామి దేవాలయం ఆవరణలో గుర్తు తెలియని వ్యక్తులు శుక్రవారం రాత్రి క్షుద్రపూజలు చేసిన సంఘటన వెలుగులోకి వచ్చింది. పరిసర పొలాల రైతులు అక్కడికి వెళ్లిచూడగా పసుపు, కుంకుమలతో అలంకరించి, అగర్‌బత్తీలు వెలిగించి కొబ్బరికాయ కొట్టి పూజచేయడంతోపాటు కోడిని బలిచ్చినట్లు బయటపడింది. ఈ విషయమై ఎస్‌ఐ రవీందర్ నాయక్‌ను వివరణ కోరగా తమకు ఎలాంటి ఫిర్యాదు అందలేదని తెలిపారు.

లక్నాపూర్ ప్రాజెక్టు పరిశీలన



లక్నాపూర్ ప్రాజెక్ట్ వద్ద నిమజ్జన ఏర్పాట్లను పరిశీలిస్తున్న అడిషనల్ కలెక్టర్ లింగ్యానాయక్, అధికారులు

అడిషనల్ కలెక్టర్ లింగ్యానాయక్

పరిగి: లక్నాపూర్ ప్రాజెక్ట్ వద్ద నిమజ్జన ఏర్పాట్లను శనివారం అడిషనల్ కలెక్టర్ లింగ్యానాయక్ అధికారులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నిమజ్జన సమయంలో ఎలాంటి ఇబ్బందులు ఎదురుకాకుండా అన్ని చర్యలు తీసుకోవాలని సూచించారు. అనంతరం అక్కడ జరుగుతున్న నిమజ్జన ఏర్పాట్లను అధికారులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ మండలంతో పాటు చుట్టుపక్కల గ్రామాల్లోని వినాయక నిమజ్జనానికి భక్తులు వస్తుంటారని అధికారులు తప్పకుండా పర్యవేక్షించాలని కోరారు. ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటు చేసుకోకుండా పకడ్బందీగా బందోబస్తు నిర్వహించాలని పోలీసులకు సూచించారు. నిమజ్జనానికి వచ్చే వారు పోలీసుల, అధికారులకు సలహా, సూచన మేరకు నడుచుకోవాలన్నారు. కార్యక్రమంలో ఆర్డీఓ వాసుచంద్ర, తహసీల్దార్ వెంకటేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా అనంత వ్రతాలు

పెద్ద సంఖ్యలో పాల్గొన్న భక్తులు



వ్రతం ఆచరిస్తున్న భక్తులు

అనంతగిరి: వికారాబాద్ పట్టణ సమీపంలోని అనంతగిరి గుట్టపై వెలసిన శ్రీ అనంతపద్మనాభ స్వామి ఆలయంలో అనంత చతుర్దశిని పురస్కరించుకుని శనివారం అనంత వ్రతాలు ఘనంగా నిర్వహించారు. ఒక్కసారి ఈ వ్రతం ఆచరిస్తే 14 ఏళ్ల పాటు చేయాల్సి ఉంటుందని అర్చకులు తెలిపారు. ఆయా జిల్లాలు, కర్ణాటక నుంచి వ్రతం ఆచరించే వారు ఉదయం 9గంటలకే ఆలయ ప్రాంగణానికి చేరుకున్నారు. 185 జంటలు వ్రతం ఆచరించారు. అనంతరం స్వామివారికి కల్యాణం జరిపించారు. ప్రత్యేక హారతి ఇచ్చి తీర్థ ప్రసాదాలు పంపిణీ చేశారు. మహిళలు ఆలయ ప్రాంగణంలో దీపాలు వెలిగించి మొక్కులు తీర్చుకున్నారు. అన్నదానం నిర్వహించారు. వేడుకల్లో ఆలయ ట్రస్టీ పద్మనాభం, ఈవో నరేందర్ తదితరులు పాల్గొన్నారు.

పచ్చని చెట్లకు 'విస్తరణ ముప్పు'!

బషీరాబాద్: అగ్గనూరు నుంచి బషీరాబాద్ ప్రధాన రోడ్డుకు ఇరువైపులా పదేళ్ల క్రితం ఫారెస్టు అధికారులు నాటిన మొక్కలు వృక్షాలుగా ఎదిగి నీడనిస్తున్నాయి. అవెన్యూ ప్లాంటేషన్‌లో భాగంగా నాటిన వీటిని అటవీ సిబ్బంది కంటికి రెప్పలా కాపాడారు. అయితే రోడ్డు విస్తరణలో భాగంగా చెట్లను తొలగించేందుకు ఫారెస్ట్ అధికారులు అనుమతి ఇచ్చారు. మోహన్ అనే వ్యాపారి టెండర్ ద్వారా పొందారు. అయితే శనివారం రోడ్డు విస్తరణ పనుల్లో భాగంగా పెద్ద సంఖ్యలో చెట్లను హిటాచీతో చీల్చారు.



కాశీంపూర్ వద్ద తొలగించిన చెట్ల కొమ్మలు

భర్తను చంపిన భార్యకు జైలు

- నిందితురాలిని వికారాబాద్ కోర్టులో హాజరుపర్చిన పోలీసులు
- రిమాండ్‌లో భాగంగా చంచల్‌గూడ జైలుకు తరలింపు
- వివరాలు వెల్లడించిన సీఐ రఘురాములు



హత్య కేసు వివరాలు వెల్లడిస్తున్న సీఐ రఘురాములు

బంట్వారం: బండరాయితో మోది భర్తను చంపిన కేసులో భార్యను రిమాండ్‌కు తరలించినట్లు సీఐ రఘురాములు తెలిపారు. కోట్‌పల్లి పోలీస్ స్టేషన్‌లో ఎస్‌ఐ శైలజతో కలిసి శనివారం ఇందుకు సంబంధించిన వివరాలు వెల్లడించారు. రాంపూర్ గ్రామానికి చెందిన రాంచంద్రయ్య (44), సుజాత దంపతులు. వీరికి ఇద్దరు ఆడపిల్లలు. రాంచంద్రయ్య వ్యవసాయ పనులతో పాటు పంచాయతీ వర్కర్‌గా పనిచేసేవాడు. ఇదిలా ఉండగా వేరే ప్రాంతానికి వెళ్లి బతుకుదామంటూ సుజాత కొన్నాళ్లుగా భర్తతో గొడవపడుతోంది. ఇందుకు ఆయన ససేమిరా అనడంతో అడ్డుతొలగించుకోవాలనుకుంది. గురువారం రాత్రి గాఢ నిద్రలో ఉన్న రాంచంద్రయ్య తలపై బండరాయితో మోది హత్యచేసింది. నేరం రుజుకావడంతో హత్యకు పాల్పడిన సుజాతను శనివారం వికారాబాద్ కోర్టులో హాజరుపర్చి చంచల్‌గూడ జైలుకు తరలించామని సీఐ తెలిపారు.